# సమస్యా-పరిష్కారం

ఎమ్.ఆర్. ప్రసాద్



సూర్యభగవానుడు అస్తాద్రితో తన అశ్వాలకు అవరోధాన్ని వెతుక్కుంటున్న వేళ. ఆకాశంలో పేలవంగా అరుణవర్ణం అలుముకొంది. ధరిత్రీ దేవి నిశాదేవిని ఆత్మీయతతో ఆహ్వానించటానికి సిద్ధమవుతుండగా, పగలు రాత్రిని విడదీస్తున్నట్లుగా సింగి నేల కలిపే చోటు గీత గీసినట్లు గోచరిస్తోంది.

నిశారేవి కురులలోని పాపిటలా తెల్లని సిమెంటు రోడ్డు అస్పష్టంగా అగుపడుతోంది. ఊరు దగ్గరవుతున్న కొద్దీ కారు వేగం హెచ్చించాను. కాసేపటికి సిమెంటు రోడ్డు మీదనుంచి, మట్టిరోడ్డు మీదకు మళ్ళించాను కారుని. అప్పుడే కొన్ని జల్లు పడి ఆగిపోయి వుండటం చేత దుమ్ము లేవటంలేదు. ఆకాశాన్నంటుకొని వున్న కనీ కనబడని ఇంద్రధనుస్సు అక్కయ్య మనసులోని అస్పష్ట భావాలని గుర్తు చేస్తోంది.

కారు బంగళాలోకి మళ్ళించాను.

దిగి లోపలికి నడిచాను.

అక్కయ్య ఎదురొచ్చింది.

"ఏమిటే కొంపలంటుకుపోతున్నట్లు ఉన్నపళంగా బయలుదేరి రమ్మని టెలిగ్రాం యిచ్చావు? ప్రకాశం మళ్ళీ పోట్లాడి ఇంట్లోంచి వెళ్ళిపోయాడా?" అన్నాను.

"అలా వెళ్ళిపోయినా బాగుండేది" అంది అక్కయ్య.

"ఏం?" అన్నాను ఆశ్చర్యంగా.

అక్కయ్య మాట్లాడలేదు. ఆమె నయనాలు అశ్రుపూరితాలయ్యాయి. ఆమెని బలవంత పరచి జరిగిందేమిటో తొందరగా నిర్ధారించలేను. ఈ గొడవలు మామూలే. మళ్ళీ అక్కయ్య పుత్రుడేదో గొడవ చేసి వుంటాడు. కనీసం రెండునెలల కోమారైనా ఘనకార్యం లేకపోతే వాడికి మనశ్శాంతి వుండదు. జరిగిందేమిటో నేను అడక్కుండా అక్కయ్యే చెబితే బాగుండునని పించింది.

అక్కయ్య కంట్లో నీరు బుగ్గల మీదుగా జారింది!

నిరుత్తరంగా సోఫాలో కూలబడ్డాను.

ఆఖరుకి అక్కయ్యే అంది "నా బాధ వాడు అర్థం చేసుకోడు ఎందుచేతలా? తండ్రి పోయినప్పటి నుండి పెంచి, పెద్దచేసి వాడి కోసమే జీవితాన్ని కనిపెట్టుకు పడివున్న నన్ను, నా భావాలని సానుభూతితో ఎందుకు అర్థం చేసుకోడు?"

విసుగెక్కువైంది నాకు. "అక్కయ్యా నువ్వీ మాటలు ఒక్కసారి కాదు. పదేపదే చెప్పావు. ఈ పాత రికార్డు వినలేను నేనిక. నువ్వు వాడు నిన్ను అర్థం చేసుకోవాలంటావు, వాడు తనని నువ్వు అర్థం చేసుకోవాలంటాడు. ఒకరు నిన్ను సానుభూతితో అర్థం చేసుకోలేదని ఫిర్యాదు పెట్టడం కంటే, నువ్వే ఇతర్లని అలా అర్థం చేసుకోటానికి ఎందుకు ప్రయత్నించకూడదు?" అన్నాను.

"అంటే నీ ఉద్దేశ్యం—పాతికేళ్ళుగా కని పెంచిన దాన్ని నేను వాడిని అర్థం చేసుకో లేదనా?"

"నా ఉద్దేశ్యంలో మీ ఇద్దరికీ ఆ అర్థం చేసుకోవటమంటే ఏమిటో తెలీదని."

"నువ్వు కూడ అలా అంటే..."

"నయం. 'నువ్వు కూడ నన్ను అర్థం చేసుకోలేదు' అంటావనుకొన్నాను" అన్నాను.

విషాదంలో కూడ అక్కయ్య మొహంలో కోపం కనిపించింది నాకు. "నువ్వు స్నానం చేసిరా. తరువాత మాట్లాడదాం" అంటూ వెళ్ళిపోయింది అక్కడినుండి.

నిదానంగా లేచి మేడ మీదికి వెళ్ళాను. ప్రకాశం గదిలో లేడు. బాత్‌రూము కేసి నడిచాను. వేడినీళ్ళ స్నానం చేసినా చిరాకు తగ్గలేదు. అక్కడ ఆఫీసులో పని ఒత్తిడి

వదిలేసి వచ్చాను. తీరా ఇక్కడికివస్తే మామూలు గొడవే. మళ్ళీ ఇద్దరికీ సంధి జరపాలి నేను. అసలు శాంతి బలవంతం చెయ్యకపోతే వచ్చేవాడిని కాదు. మామూలు గొడవలే అన్నా శాంతి వినలేదు.

"ఏమీ జరక్కపోతే టెలిగ్రాం ఎందుకిస్తుంది" అంది శాంతి. శాంతి కూడ అక్కయ్యని అర్థం చేసుకోలేదు— నవ్వొచ్చింది నాకు. నేనూ ఉపయోగిస్తున్నా పదాన్ని!

స్నానం ముగించి వంటింట్లోకి వెళ్ళాను. అక్కయ్య డైనింగ్ టేబిలు మీద భోజనానికి పళ్ళాలు పెడుతోంది. కుర్చీలాక్కుని కూర్చున్నాను.

"శాంతి కులాసాయేనా?" అంది.

"శాంతి కులాసాకేమిటిలే. లక్షణంగా వుంది. నేను లేను కదా అని స్నేహితురాళ్ళతో ఏ ప్రోగ్రామో వేసుకొని వుంటుందీ పాటికి. అసలు సంగతి చెప్పు ఏమైంది? ఉపన్యాసాలు మాత్రం వద్దు."

ప్రకాశం సంగతి ఎత్తేటప్పటికి, అక్కయ్య నిరుత్సాహంగా కుర్చీలో కూలబడింది.

"పేకాటల గొడవా?"

అడ్డంగా తలూపింది.

"డబ్బు లెవరికేనా బాకీ పడ్డాడా?"

"ఊహూఁ! అవన్ని మానేసినట్టున్నాడు."

"మరేమిటి?" అన్నా విసుగ్గా.

"ఒక అమ్మాయి" అంది అక్కయ్య.

కాసేపు అలానే కూర్చుండిపోయాను.

"చిన్న గొడవైతే సర్దుపోయేదాన్ని. ఇంత బాధపడేదాన్ని కూడా కాదు. కాని ఇలాంటిది జరుగుతుందనుకో లేదు."

"నువ్వనుకోలేదు. నాకెప్పుడో తెలుసు ఇలాంటి దేదో జరుగుతుందని. వాడేం పిప్పరమెంట్లు, చాక్లెట్లు తినే స్కూలు కుర్రాడనుకున్నావా? పాతికేళ్ళు వచ్చాయి. సరే— ఒక అమ్మాయితో తిరుగుతున్నాడు. మగవాడి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఒక ఆడది తటస్థ పడక తప్పదు....."

"అది ఆడది కాదు. కిలాడి" మధ్యలోనే నా మాటలు కడ్డొస్తూ అంది అక్కయ్య.

"ఎవతో ఒకతె. ఎవరైతేనేం?— నాలుగు రోజులు తిరుగుతాడు. జీవితం అర్థమవగానే అసలు సంగతి తెలుసుకొంటాడు. ఆలోగా నీ పెద్దరికం ఉపయోగించి ఏదేనా చెయ్యబోయావా వ్యవహారం చెడిపి కొడుతుంది."

"ఉపేక్షిస్తే వాడి జీవితమే చెడిపి కొడుతుంది."

"నువ్వంటున్న దేమిటి?"

"నేనంటున్నది నువ్వనుకుంటున్న దాని కంటే సీరియస్ అయిన విషయం. దాన్ని పెళ్ళి చేసుకొంటాడట వాడు!"

"మరీ మంచిది. వాడి జీవితం నో మార్గాన పడుతుంది" అన్నాను.

"ఇంజినీరింగ్ పూర్తి కాకుండానే వాడు పెళ్ళి చేసుకోవటం నాకు ఇష్టం లేదు" అంది అక్కయ్య.

"అవుతే ఈ సంవత్సరం ఆగమని చెబుతాలే ప్రకాశానికి" అన్నాను.

"అందుకు కాదు నిన్ను ఇక్కడికి పిలిపించటం. వాడు ఆ అమ్మాయిని చేసుకోవటం నాకిష్టం లేదు."

"అలా చెప్పు! నీకిష్టం లేదుకదూ?" — నా కంఠం నాకే అదోలా ధ్వనించింది. కాస్త ఆగి సౌమ్యంగా అన్నాను "అక్కయ్యా —ఒకటి చెప్పు. పెళ్ళి చేసుకోబోయేది వాడా, నువ్వా? ఆ అమ్మాయితో జీవితాంతం జీవించాల్సింది వాడా నువ్వా? నీకు నచ్చిన అమ్మాయిని వాడు పెళ్ళి చేసుకొని పరిస్థితులకు అనుగుణంగా వాడు తనని మలచుకోవటం భావ్యమా? వాడికి నచ్చిన అమ్మాయితో పరిస్థితులను నువ్వు అనుకూలంగా మలచుకోవటం భావ్యమా?"

అక్కయ్య మౌనంగా తల దించుకొని కూర్చుంది. తాపీగా ఆవకాయ కలుపుకొని నెయ్యి పోసుకొన్నాను.

"ఆ— భోంచెయ్యి—" అన్నాను.

అక్కయ్య పళ్ళాన్ని ప్రక్కకు త్రోసేసింది. చెయ్యి కడుక్కుంటూ అంది "మీ ముందు తరం వారు వట్టి బుద్ధిహీనులు, చాదస్తంలో పాతుక పోయిన వారన్న భావం నీలో కూడా వుందిరా."

"అలా అనుకోవటమే మీరు తరచూ చేసే పొరబాటు" అన్నాను.

"నీ ఉద్దేశ్య మేమిట్రా? నేను వాడి మంచిని కోరనా?" అక్కయ్య ఆవేశంగా అంది.

"పిచ్చి అక్కయ్యా" సానుభూతిగా నవ్వాను. కోప్పడక శాంతంగా ఆలోచించు. మీతరం వారిని దుమ్మెత్తి పోయటానికి రాలేదు నేను. అదో అలా చూడక. ఆ కోపం కాస్త తగ్గించుకో. కోపంతో నీ మొహం చండాలంగా వుంటుంది......"

కోపంగా కూర్చుంది అక్కయ్య.

"ఇప్పుడు విను తాపీగా. నువ్వు మంచినే కోరతావు— ఒప్పుకొన్నాను. ప్రతి తల్లీ తండ్రీ ఇలానే అనుకొంటారు. కాని ఆ 'మంచి' అన్నది వుంది చూశావ్ అది అస్పష్టమైన పదం. నీ ఉద్దేశ్యంలో మంచి మరొకరి ఉద్దేశ్యంలో మంచికాక పోవచ్చు. చెడుగా కూడా పరిగణింప బడవచ్చు. మంచి చెడు అన్నది వ్యక్తి యొక్క మానసిక వ్యవస్థపైన ఇష్టాయిష్టాల మీద ఆధారపడుతుంది. ఎదురింటి అన్నపూర్ణని చేసుకోవటం నీకు మంచిగా కనబడితే మరో సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోవటం వాడికి మంచిగా కనబడు తుంది. కాని ఆ మంచి చెడుల ఫలితాన్ని అనుభవించేది వాడు కాబట్టి వాడి నిర్ణయానికే ప్రాముఖ్యత యివ్వటం మంచిదని నా అభిప్రాయం."

"అంటే వాడి వివాహంలో నా ప్రమేయం అణుమాత్రమేనా లేదా? కేవలం వివాహానికి ఆహ్వానితుల వంటి వారేనా తలితండ్రులు? వాడు తప్పటడుగువేస్తోంటే నివారించే బాధ్యత, అధికారం నాకులేవా?"

"ఉన్నాయి. కాని మళ్ళీ ఆ తప్పటడుగు అంటున్నావు చూశావా అక్కయ్యా అది కూడ అస్పష్టమైన పదం. అది......"

"వ్యక్తి యొక్క మానసిక వ్యవస్థమీద, ఇష్టాయిష్టాల మీద అధార పడి వుంటుంది. ఒకరి ఉద్దేశ్యంలో ఒప్పు మరొకరి ఉద్దేశ్యంలో తప్పు!— ఒరేయ్ చెప్పిందే మళ్ళీ నాకు చెప్పకు. ఆ మాత్రం నేను గుర్తించుకోగలను."

"లేదు. నువ్వు గుర్తించుకో లేనిది అదొకటే కాదు. వాడు స్కూల్ కుర్రాడు ప్రకాశం కాదు. పాతికేళ్ళ ప్రకాశం. మంచి చెడ్డలు, తప్పొప్పులు, ఏవి అవునో ఏవి కాదో నిర్ణయించుకొనే బుద్ధి జ్ఞానం కలవాడన్న విషయం కూడ."

"వాడికి బుద్ధి జ్ఞానం వుందనుకోను నేను."

నవ్వాను నేను. "అది మీ తరంవారు చేసే మరొక పొరబాటు."

అక్కయ్య నావంక ఉగ్రంగా చూసింది. తరువాత నెమ్మదిగా అంది "నాతో వాదించి నీ తెలివి తేటలు చూపించుకో ప్రయత్నించకు. అది వృథా— పైగా నీకు నేనేం బహుమతి ఇవ్వబోవటం లేదు. నీ మాటలు వింటూంటే నువ్వేదో ప్రిజుడిస్‌తో మాట్లాడుతూ వున్నావనిపిస్తోంది. అసలు నువ్వా అమ్మాయిని ఒకసారి చూస్తే ఇలా మాట్లాడవు."


"ఏం? అందంగా లేదా?"


"వెధవలా మాట్లాడకు. అందంగా లేకపోతే దాని చుట్టూ ఎందుకు తిరుగుతాడు వాడు? అందం సంగతి కాదు నేను అంటున్నది. ఆ కట్టూ బొట్టూ, తీరు, తెన్నూ......"

"ఎలా వున్నాయి?" అడిగాను.

## సమస్యా పరిష్కారం

"నీ మొహంలా వున్నాయి...." అక్కయ్య కోపం తగ్గించుకొని నెమ్మదిగా అంది "అసలు బొట్టు లేదు. కట్టు విషయమా — దాదాపు ఒళ్లంతా కనబడుతుంది."



"తీరు తెన్నూ?"

"ఆఫీసులో టైపురైటర్ని బద్దలు కొట్టడం, క్లబ్‌లో డాన్సులు చేయటం" మౌనం వహించాను.

"అర్థమైందా?" రెట్టించింది.

"ఆ!" అన్నా.

"ఏమైనా చెయ్య దల్చుకొన్నావా?"

"ఏం చేయమంటావు?"

"పోలీసాఫీసరువి. ఆ మాత్రం తెలీదూ?"

"వెళ్లి బెదిరించమనా?"

"దాంతో వ్యవహారం కాకపోతే కాస్త డబ్బు పడెయ్యి దాని మొహానికి".

"సినిమాల్లో వాంప్‌లా మాట్లాడుతున్నావు."

"మళ్లీ నీ తెలివి వెలగ బెట్టకు. ఇది జీవితం" అంది అక్కయ్య.

"ఆల్‌రైట్! ఇది జీవితం. అందుకే నీకింతవరకూ చెప్పాను. నా ఉద్దేశ్యం ప్రకారం ప్రకాశానికి చెప్పటమే మంచిది".

"వాడు వినడు."

"వాడు వినడు. నువ్వు నీ పట్టు మానవు. పోనీ ఆ అమ్మాయి అలాంటిది కాక మంచిదే అయితే నువ్వు వారి వివాహానికి అంగీకరిస్తావా!"

తల అడ్డంగా వూపింది.

"నాకు అది నచ్చటం లేదు" అన్నాను.

"నీకు నచ్చిందా లేదా అని అడగటానికి కాదు నిన్ను పిలిపించింది. ఆ అమ్మాయి మంచిదో కాదో నీకంటే నాకు బాగా తెలుసు. వాడి జీవితం బాగు చెయ్యటానికి సహాయ పడతావా—ప్రయత్నించు. నీకే మార్గం తోచలేదా—నీకారు వుంది, పెట్రోలు పోయించి పెడతాను. తిరుగు ప్రయాణంలో ఏ పెట్రోలుబంకు దగ్గిరా ఆగాల్సిన పని వుండదు."

"నువ్వు నాకు ఛాయిస్ వదలటంలేదు."

"అది నిజం. ఎందుకంటే నాకే ఛాయిస్ లేదు కనుక" అక్కయ్య లేచి గంభీరంగా బయటికి వెళ్లిపోయింది!

* * *

ఉదయం కాఫీలయ్యాక ప్రకాశం కనిపించాడు.

"ఏరా రాత్రి భోజనానికి రాలేదేం?"

"శశి ఇంట్లో చేశాను."

"ఎవర్రా శశి?"

"చెప్ప లేదేమిటి మామయ్యా అమ్మ నీకింకా? నువ్వు అమాయకత్వం నటించాల్సిన

(4[illegible]వ పేజీ చూడండి)

అవసరంలేదు. నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావో కూడ తెలుసు.''

''ఎందుకొచ్చానంటావు?'' ఎదురుప్రశ్న వేశాను.

''అదీ నాతోనే చెప్పించాలా?''

ముసుగులో గుద్దులాట లాభంలేదని తెలిసిపోయింది. సూటిగా అడిగాను.

''ఆ శశినే ఎందుకు పెళ్ళాడాలిరా?''

''ఏం నువ్వెందుకు శాంతి అత్తయ్యనే పెళ్లి చేసుకున్నావు?'' కాసేపటి దాకా సమాధానం ఏం యివ్వాలో నాకు తోచలేదు.

''శాంతి క్లబ్బుల్లో డాన్సు చెయ్యదు'' అన్నాను ఆఖరుకి.

''శశి క్లబ్బుల్లో డాన్సు చేస్తుందని అమ్మ చెప్పిందా? ఒక్క నాతోనే ఒక్కసారి డాన్సు చేసింది'' గర్వంగా చెప్పాడు.

నేనేం మాట్లాడలేదు.

''ఇదుగో మామయ్యా నువ్వు మౌనం వహించి ఈ విషయాన్నేదో పెనుభూతంలా తయారు చేద్దామని ప్రయత్నించకు. శశి ప్రొఫెషనల్ డాన్సర్ కాదు—నీ మనసులోది అదవుతే. ఇక ఫ్యాషనబుల్‌గా వుందా అది తప్పుకాదు. ఈ కాలంలో కూడ అమ్మాయి అని వంటింట్లో కూర్చోమంటే ఎలా? పైగా శశికి వంటింట్లో కూర్చుంటే కుదరదు. కాన్వెంట్‌లో చదివే ఓ తమ్ముడు కుంటి తల్లి వున్నారు. మరి ఉద్యోగం చెయ్యకపోతే ఎలా?''

ఈ మాటలా నాకు మౌనమే శరణ్యం అయింది. ప్రకాశం కాసేపు ఆగాడు. ఆవేశం అణచుకొంటున్నట్లు స్పష్టంగా అగుపడుతోంది.

# సమస్యా పరిష్కారం

(12వ పేజీ తరువాయి)

''నాకు తెలీక అడుగుతాను కాని డాన్సు చేస్తే ఏమిటి తప్పు?'' అన్నాడు.

''సరియైన గృహిణిగా రూపొందలేదని అమ్మ భావం.''

''అమ్మ భావం మాత్రం అయి నీ భావం కానందుకు సంతోషిస్తున్నాను మామయ్యా. క్లబ్‌లో ఒకసారి డాన్సు చేసినంతమాత్రాన సరియైన గృహిణిగా రూపొందలేదనటం నాకు సమంజసంగా గోచరించదు. నీకు తెలీదేమో. శశివల్లే నేను పేకాట మానేశాను. నువ్వు నమ్మవుగాని క్లబ్బుల్లో డాన్సులు చేయటం, రాత్రింబగళ్ళు అక్కడే వుండటం ఎంత అసహ్యంగా వుంటుందో నాకు తెలియజేయడానికే ఆమె డాన్సు చేసింది. అమ్మ నేను మారానని నీతో అని వుండదు. అసలు ఆమె నమ్మితేగా? అయినా ఈ మంచికి అంతెక్కడిది మామయ్యా? నాలో అంతా మంచే వుందా—శశిలో అంతా మంచినే కోరటానికి?''

''శశిలోని చెడు ఏమిటి?''

ప్రకాశం కోపంగా చూశాడు నావంక. ''మనుష్యులని ఇరుకులో పెట్టి పశ్నలడగటంలో నువ్వు దక్షుడివి మామయ్యా. పోనీగాని, అమ్మతో నువ్వు చెప్పకపోయావా?''

''ఏమని''

ప్రకాశం మొహం అటు తిప్పుకొని అన్నాడు ''ఆ చాదస్తం మానమని.''

''చాదస్త మేముంది ఇందులో?''

నన్ను విచిత్రంగా వీక్షిస్తూ అన్నాడు ప్రకాశం ''మైగాడ్! అమాత్రం తెలీదూ నీకు? పాతకాలం వాళ్ళలా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్ళని అనుకోవటం!''

''ఆకుందేటికి మూడేకాళ్ళున్నాయేమో?'' అన్నాను.

''అమ్మలా మనుష్యులని చూడకుండానే మాట్లాడకు. శశిని చూశాక చెప్పు నీ అభిప్రాయం. నేను తొందరపడి జీవిత భాగస్వామిని నిర్ణయించుకోబోతూంటే సావధానంతో సలహా యిచ్చే అధికారం నీకుంది.''

''సలహా యిచ్చే అధికారం మాత్రమేనా?''

''అంతే. ఎందుకంటే ఇది నా జీవిత సమస్య—నీదికాదు, అమ్మదీ కాదు...'' కాస్త ఆగి అన్నాడు ''ఎనిమిదింటికే కాలేజి వుంది సాయంకాలం చూపెడతాను శశిని.''

* * *

అన్నట్లుగానే సాయంకాలం బీచిలో పరిచయం చేశాడు శశిని ప్రకాశం నాకు.

''నమస్తే'' అంది చేతులు జోడిస్తూ.

ప్రతినమస్కారం చేస్తూ ఆమెని పరికించి చూశాను. శశి చక్కటి అందగత్తె అనటం మాత్రం నిస్సందేహమైన విషయం. అక్కయ్య చెప్పినట్లుగా పూర్తిగా ఆంగ్లోయిండియన్‌లా లేదు. కనీకనబడనట్లుగా వున్న నుదటి మీది ఎర్రబొట్టు ఆమె శరీరఛ్ఛాయ ముందు వెలవెలా బోతోంది. రెండు జడలు వేసుకొని వుంది. ఆకుపచ్చని టెర్లిన్ చీరలో ఆమె విగ్రహం హుందాగా కనబడుతోంటే, ఆమె కళ్ళు చిలిపితనాన్ని వ్యక్తపరుస్తున్నాయి. ఆమె ప్రతి కదలికా ఆలోచించి వేస్తున్నట్లు వుంది. మొహం మీద, తన స్థితిగతులతోను, చుట్టుపట్ల పరిసరాలతోను సమన్వయించుకొనే వ్యక్తికి గల సంతృప్తి గోచరిస్తోంది.

ఇసకలో కూలబడ్డాము.

ఏం మాట్లాడాలో, ఎలా విషయాన్ని కదల్చాలో నాకు అవగాహన అవటంలేదు.

''ఎన్నిమార్కులు వేశారు?'' అంది శశి.

''ఏమిటి?'' అన్నా ఆశ్చర్యంగా.


''నన్ను పరీక్షించటానికి వచ్చారుగా. ఉత్తీర్ణురాలి నవగలుగుతానా అని అడుగుతున్నాను.'' అంది.

చిన్నగా నవ్వాను.

''నువ్వింత గుంభనగా వుండాల్సిన అవసరంలేదు మామయ్యా. అసలు విషయంలోకి దిగు. వెళ్ళేలోగా తాడో, పేడో తేల్చి వెళ్ళు'' అన్నాడు ప్రకాశం.

''నేనెవర్నిరా తేల్చటానికి? తేల్చుకోవలసింది, అక్కయ్య, నువ్వు, శశినూ.''

''మరి నువ్వెందుకు వచ్చినట్లు?''



''ఆ డ్రైవర్లిద్దరూ ఇంతా—ఎంతసేపు మాట్లాడుతుంటారో అర్థంకాకుండా వుంది.''

"అదే నాకూ అర్థం కావటంలేదు..." అన్నాను.

ప్రకాశం మాట్లాడలేదు.

"ఆవిడ ఏమన్నారు?" అంది శశి.

"ఏవిడ?"

"మా కాబోయే అత్తగారు" అంది శశి చిన్నగా నవ్వుతూ.

"అంత నిశ్చయంగా చెబుతున్నావే—క్షమించాలి నా ఏకవచన సంబోధనకి"

"ఫరవాలేదులెండి" అంటూ మళ్లీ చిన్నగా దరహాసం చేసింది. ఆ నవ్వు చూస్తుంటే ప్రకాశం ఆమెని పెళ్లాడతానని పట్టుపట్టడంలో తప్పు లేదనిపించింది.

మళ్లీ తనే అంది "మీరు నా ప్రశ్నకి సమాధానం యివ్వలేదు." అని. అసాధ్యురాలే అనిపించింది నాకు.

"ఏమని వుంటుందో తెలుసుకోలేని అమాయకురాలివిలా కనిపించటంలేదు నువ్వు. కాని ఇంత తెలిసీ ముందుగా కాస్త సర్దుకోకపోయా రెందుకని విచారంగా వుంది నాకు." అన్నాను.

"ఏమా ఉద్దేశ్యం?" అంది.

"ఏమీలేదు. కొద్దిగా ఫ్యాషన్లు—లవీ తగ్గించి సనాతన యువతిలా మా అక్కయ్యకి కనబడకూడదూ? ఆమెతో పరిచయం చేసుకొని ఆమె అభిమానాన్ని మూరగొనటానికి ఎందుకు ప్రయత్నించి వుండకూడదు? అప్పుడీ విషయం ఇంతదాకా వచ్చేదే కాదుగా..."

"చూడండి. పెద్దాళ్లంటే గౌరవం నాకుంది. వారి అభిప్రాయాలని సానుభూతితో పరిశీలించాలనీ తెలుసు. కాని నా వ్యక్తిగత విషయాలని, ఇష్టాయిష్టాలని—అందులోనూ వారికే విధంగా సంబంధించని వాటిని మార్చుకోవాలన్న వాదం నాకు సబబనిపించదు. పోతే అలా నటించటమంటారా, అది నాకు అసహ్యం."

నొక్కి చెప్పకపోయినా ఆ మాటల్లో నిశ్చయం స్ఫుటంగా వినిపించింది నాకు.

"నా గురించి ఆమె అభిప్రాయం విన్నారు. ఆమె గురించి నా అభిప్రాయం వింటారా?"

"చెప్పు. వినటం మినహా నేను చేస్తున్న పనేమీ వున్నట్లులేదు" అన్నాను.

"నా ఉద్దేశ్యంలో ఆమెకి ప్రకాశం నన్ను వివాహమాడటమేకాదు మరెవరిని వివాహమాడటం కూడ ఇష్టంలేదని..."

"శశి!" అన్నాడు ప్రకాశం.

"నన్ను చెప్పనివ్వండి. ఒకవ్యక్తి నా గురించి తన అభిప్రాయాలని వెలిబుచ్చినపుడు ఆ వ్యక్తి గూర్చి నా అభిప్రాయం వ్యక్తం చెయ్యటానికి నాకు హక్కు అధికారం వున్నాయి." అని ప్రకాశంతో అని నావేపు తిరిగి అంది "నా మాటలు కరకుగా వుంటే క్షమించాలి."

—"ఫరవాలేదు కానివ్వు" అన్నాను.

"ప్రకాశం అంటే ఆమెకి అమిత ప్రేమ. భర్త పోయినప్పటి నుంచి వారినే ప్రాణంగా చూసుకొంది. ప్రకాశం కోసమే జీవించింది, జీవిస్తోంది. అలాంటి సమయంలో ఒక యువతి అతని జీవితంలో ప్రవేశిస్తే అతనికి తన ఎడగల ప్రేమ తగ్గిపోతుందేమోనని, తన కతను దూరమైపోతాడేమో అన్న భావం ఆమెలో వుంది. ఈ అసంబద్ధ భావం ఆమె నరాలని తినివేస్తూ కుమారుడు ఎప్పటికీ అవివాహితుడు కావాలనే హాస్యవికతను ఆమె విస్మరించేలా చేయిస్తోంది."

శశి అభిప్రాయం వెంటనే ఆమోదించలేకపోయాను నేను. అసలా భావమే వెగటుగా తోచింది. కానీ ఏమో! ఎవరు చెప్పగలరు! అక్కయ్య ప్రకాశాన్ని అమితంగా ప్రేమి


ఏజెంట్లు కావలెను


శ్రేష్ఠమైన మా అలంకరణ వస్తువులు ఫౌన్టెన్ పెన్నులు మరియు వాచీలు ప్రసిద్ధవుటకు విరామ సమయంలో విక్రయించుటకు ఏజెంట్లు వెంటనే జీతం రు. 175 నుండి రు. 300 మరియు కమిషన్ పద్ధతిన కావలెను. ఉచిత షరతులకు, సాంపిల్ పెట్టెనకూ నేడే వ్రాయుండి,

UNITED INDIA CORP.,
Seetla (WAP), Amritsar.



# జీవన్ టోన్

రిజిస్టర్డు నెం. 218726



జీవన్ టోన్ ఎముకలపోగులా వున్నవారికి లావును ఇచ్చుటకు తోడ్పడును. జీవన్ టోన్ కేవలం వనస్పతి కొవ్వునుంచి తయారుచేయబడినది కాని జంతువుల కొవ్వునుండి మాత్రం కాదు. ఎంత మంచి ఆహారము తిన్నా ఎముకలపోగువలె బలహీనముగా వుండేవారికి జీవన్ టోన్ మంచిబలాన్ని, లావును, బరువును యిచ్చును. ఆకలి లేనివారికి మంచిజీర్ణశక్తినిఇచ్చును. ఇది బలహీనత, కాళ్ళుచేతులు తేలిపోవుట, తలతిరుగుడు, రక్తహీనతలను పోగొట్టి, పరిపూర్ణమైన ఆరోగ్యమును, పుష్టిని ఇచ్చును.

శరీరము ఎరుపుఛాయపొందడానికి జీవన్ టోన్ తో టొమాటోలు తీసుకోండి. ఆరోగ్యవంతులకుకూడ జీవన్ టోన్ మంచిది. జీవన్ టోన్ తీసుకొన్నప్పుడు మీకు కొంత శరీర వ్యాయామము అవసరము. కావలసిన బరువు, బలిష్ఠత చేరిన వెంటనే జీవన్ టోన్ సేవించుట నిలుపుట మంచిది.

ఇతర వివరములు మందుతో పంపబడుతాయి.

వెల: 450 గ్రాములు రూ. 10 (పోస్టు చార్జీలు రూ. 3)

*Dr. Vasan*, **Jothi Hospital,**
**28, North Boag Road, T' Nagar.**
**Madras-17.**

# సమస్యా పరిష్కారం

స్తుందని, ఆమె జీవితమంతా వాడి కోసమే నని నాకు తెలుసు. మనసు అంగీకరించినా, అంగీకరించకపోయినా శశి చెప్పిన విషయం నిజం కావటానికి కనీసం అవకాశమేనావుంది.

''సరే. ఇంతకీ ఏం నిర్ణయించారు?'' అన్నాను.

''నిర్ణయించటానికి ఇందులో ఏముంది మామయ్యా. నువ్వు ప్రయత్నించి ఏదో విధమైన పరిష్కారం చేస్తావని ఆశిస్తున్నాను. నీ ప్రయత్నాలు కూడ విఫలమయ్యాయా.....''

''విఫలమవుతే?''

ప్రకాశం కాసేపటి దాకా మౌనం వహించి తరువాత అన్నాడు

''ఇంతవరకు సున్నితంగా ప్రయత్నించాను. లాభంలేకపోతే కష్టమైన మార్గం అనుసరించక తప్పదు.''

''అలాంటి తొందరబాటు పనులు చేయకు. అటు నీ చదువు పాడవటమేకాక నీ భావిజీవితపు పునాదులు కూడ సరిగ్గా పడవు.'' అన్నాను.

ప్రకాశం మాట్లాడలేదుకాని, శశి మాత్రం నిశ్చలంగా నా వంక చూస్తూ అంది ''ఫరవాలేదు. నేను ఉద్యోగం చేస్తూ ఆయన్ని చదివించగలను.''

అర్థమైంది నాకు వారి నిర్ణయం.

* * *

పోస్టాఫీసులోంచి శాంతికి ట్రంకాల్ చేశాను. శాంతికి అసలు విషయం చెప్పేటప్పటికి మూడు నిముషాలయింది. సంభాషణ అయ్యేలోగా రెండుమాట్లు ఎక్స్టెండ్ చెయ్యాల్సి వచ్చింది.

అంతా విన్న శాంతి గలగలా నవ్వింది ఫోనులో. ''వారిద్దరి నిశ్చయం మారదా?'' అంది.

''అలానే వుందిమరి'' అన్నాను.

''మీరీ సమస్యకి ఏదేనా నాటకీయమైన పరిష్కారం లభిస్తుందేమోనని ప్రయత్నిస్తున్నారా?''

''అలా జరిగితే బాగుంటుంది శాంతి''.

మళ్లీ నవ్వింది శాంతి ''అసలు మీ ముందు సమస్యే లేదు—మీరు ఆలోచించటానికి, పరిష్కరించటానికి'' అంది.

''నువ్వంటున్నదేమిటి శాంతి?''

''వాళ్లిద్దరూ ఏం జరిగినా పెళ్లి చేసుకోదల్చుకొన్నారని స్పష్టమవుతోంది. ఆ వివాహాన్ని ఆపలేరు. అందుకు ప్రయత్నించటం కూడా హర్షింపదగ్గ విషయం కాదు. మరి అలాంటప్పుడు మీ బుర్ర బద్దలు కొట్టుకోవటం అనవసరం. అలా చేసినా మీకు తోచే పరిష్కార మార్గం ఏమీ వుండదు.''

''మరి అక్కయ్య?''

''మీ అక్కయ్య తను నిర్మించుకున్న ఊహాలోకం నుంచి బయటపడి చేదు నిజాన్ని ఎదుర్కోవటం నేర్చుకోవాలి. కఠోర వాస్తవికతను తెలుసుకొని భరించటం అలవర్చుకోవాలి. మొదట్లో కాస్త షాక్ ఫీలవవచ్చు. కాని కాలమే ఆమె గాయాలని మాన్పాలి.''

''అంతేనా శాంతి? అక్కయ్య ఓడిపోవలసిందేనా?''

''ఇందులో ఆమె గెలుపు, ఓటమీ ఏమీ లేదు. ఇది జీవితం అని ఆమె అన్న మాటని ఆమెకే చెప్పండి. ఈ జీవన పథంలో పరిస్థితులను అనువుగా మలచుకో ప్రయత్నించటమే మానవ ధర్మంకాని, పరిస్థితులు మారనప్పుడు వాటికి తలఒగ్గటం కూడ నేర్చుకోవాలని మీ అక్కయ్యని గ్రహింపజేయండి.''

మవునంగా శాంతి మాటలు వింటూండిపోయాను. ఆమె చెప్పింది నిజమే. బుర్ర బద్దలు కొట్టుకొన్నా లేని ఈ సమస్యకు సమాధానం లభించదు. అందరికీ అనువయ్యే పరిష్కారం లభించటం అంతకంటే అసాధ్యం.

''ఉన్నారా?'' అంది శాంతి.

నవ్వాను. ''అక్కయ్యకు ఎలా చెప్పాలో ఆలోచిస్తున్నాను శాంతి'' అన్నాడు.

''ఎలా చెప్పటమేమిటి! మామూలుగా చెప్పెయ్యండి. మీరు బాధపడకండి..... అన్నట్లు బాబిగాడి గోల ఎక్కువైపోయింది. మీరు వచ్చేదాకా స్కూల్‌కి వెళ్లాలేదు. త్వరగా వస్తారుగా?''

''అలాగే శాంతి'' —

ఫోను వుంచేసి బయటికి నడిచాను. శాంతి చెప్పింది గుర్తు కొచ్చింది.

అవును—ఇది జీవితం.

జీవితం లాగే ఎదుర్కోవాలి దీన్ని!



మద్రాసు నగరం, చెంగల్పట్, గుంటూరు, కడప, కర్నూలు, బళ్ళారి, అనంతపూరు, కృష్ణా, నెల్లూరు, చిత్తూరు, ఉత్తర అర్కాటు జిల్లాలకు ఏజెంట్లు:
ది నేషనల్ ప్రోడక్ట్సు సిండికేట్,
292, తిరువత్తియూర్ హైరోడ్, మద్రాసు—21.